

# సంధ్యారాధన

బి.వి.రమణారావు

అందానికి రూపాన్నిచ్చిన అదే మొహం; చూపుల్లో చిలిపితనం చిందించే అదే కళ్ళు; మనుషుల్ని మనసుల్లో మొగ్గలు వేయించే అదే మధురమందహాసం; తెల్లని సాదాచీర, తెల్లని రవిక, మెళ్ళో ఒంటిపేట గొలుసు, కుడిచేతికి రెండు బంగారు గాజులు, ఎడమచేతికి రిస్టువాచీ, పొదుపుగా భుజంమీదనుంచి ముందుకి వేళ్ళాడే వాలు జడ; అదే నిరాడంబర వేషం. ఐదు సంవత్సరాల క్రితం ఎలా వుందో సంధ్య యిప్పుడూ అలాగే వుంది. ఎటొచ్చీ కొంచం వొళ్ళొచ్చిందేమో, శరీరము వొంపులు తీరి మరింత అందంగా కనబడింది. సాయంత్రం, ప్రశాంతంగా పూలతోటలో మామిడిచెట్టుకింద పూల కుండీలమధ్య వేసిన పేముకుర్చీలో కూర్చుని ఏకాగ్రతతో రాసుకుంటూంటే నేను గేటు తీసిన చప్పుడుకూడా వినివుండదు. నేను అడుగుల్లో అడుగు లేసుకుంటూ పిల్లిలాగ దగ్గర కొచ్చేక, నన్ను చూసి క్షణం నిర్ఘాంతపోయి, తేరుకున్నాక ఆనందపరవశంలో కుర్చీలోంచి లేచి, చేతులోవున్న కలం, పుస్తకం టీపాయ్‌మీద పడేసి "రా...రా...ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి!" అంటూ కుర్చీలో కూలేసి, ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని, "కలకత్తానుంచి ఎప్పుడొచ్చేవు. ఒక్కడివే వొచ్చేవా, మీ యావిణ్ణీ పిల్లల్నీకూడా తీసుకొచ్చేవా!" అంటూ కుశలప్రశ్నలు ప్రారంభించింది.

సంధ్య ప్రవర్తనలోకూడా ఏమీ మార్పులేదు. ఇంత ఆప్యాయంగా పలకరించి మాట్లాడుతుందనుకోలేదు. ఐదేళ్ళ క్రితం నేను కలకత్తాకి వెళ్ళిపోయే ముందరయినా సంధ్యను కలుసుకోలేదు. తరువాత ఉత్తరమైనా రాయలేదు.

"మా ఆవిణ్ణి పుట్టింట్లో దిగపెట్టి వొచ్చేను. రెండ్రోజులుండి మిత్రుల్నందర్నీ సందర్శిద్దామని ఇక్కడ దిగేను." అన్నాను, వీలయినంత సహజత్వాన్ని ఎరువు తెచ్చుకున్న గొంతుతో.

"వచ్చినవాడివి మీ యావిణ్ణీ పిల్లల్నీకూడా తీసుకురాలేకపోయావా! బోలెడు ఆస్తితో వొచ్చినపిల్లని పెళ్ళాడేవు! ఆవిణ్ణికూడా చూసి ఆనందిద్దుము," అన్నది నవ్వుతూ. ఆ మాటల్లో వున్న ఎత్తిపొడుపు నా మనస్సుకు నాటాలనిలాగుంది ప్రతిమాటా నొక్కి నొక్కి మరీ అంది. ఇలా మాట్లాడ్డం సంధ్యకి కొత్తకాదు. చదువుకునేరోజు లిదేవరస! మొదట్నుంచీ ఖచ్చితమైన అభిప్రాయాలతో, నిర్మొహమాటంగా కుండ బద్దలుకొట్టినట్టు మాట్లాడటం అలవాటు.

"మా ఆవిడ చదువుకోలేదూ, అందంగా వుండదూ అనేగా ఆక్షేపిస్తున్నావు! అందుకే తీసుకురాలేదు."

"అలాంటి స్త్రీని, అందులోనూ స్నేహితుడి భార్యని ఆక్షేపించేటంత అనాగరికురాల్నికాను. పైగా సిగ్గులేకుండా, అందుకే తీసుకురాలే దంటున్నావు. మీ యావిణ్ణి తీసుకొచ్చి మా అందరికీ పరిచయం చెయ్యడం నీకు న్యూనతగా వుందన్నమాట! ఏడిసినట్టుంది నీ సంస్కారం!"

"మొదలెట్టేవు దండకం!" అన్నాను నిస్సహాయంగా.

"నాకు శారద వుత్తరం రాసింది. నీకు రెండు మూడుసార్లు కనబడి, ఓసారి వాళ్ళాయన్నికూడా పరిచయం చేసి, మీ ఆవిణ్ణితీసుకని వాళ్ళింటికి రమ్మని పిలిచిందటగా! నువ్వు వెళ్ళలేదు; వాళ్ళని మీ యింటికి రమ్మనలేదు. అవునా?"

"డామిట్! నువ్వు కోడిగుడ్డుకు వెంట్రుకలు పీకుతున్నావు! ఎప్పటికప్పుడు వెడదామనుకుంటూనే అశ్రద్ధచేస్తూవొచ్చాం. శారదింత రాద్ధాంతం చేస్తుం దనుకోలేదు."

"నువ్వు అసమర్ధుడివే అనుకున్నాను — అబద్ధాలుకూడా నేర్చుకున్నా వన్నమాట."

"పొరపాటు. తప్పు ఒప్పుకున్నా," అన్నాను, ఇంక వాదించి లాభంలేదని.

"స్వతంత్రంగా నీ కాళ్ళమీద నువ్వు నిలబడి చదువుకుని పైకొచ్చే యోగ్యతలేక మీఆవిడ డబ్బుతో చదువుకుని ఇంతవాడివయ్యేవు. దీనికి నీకు చిన్నతనంలేదు. మీఆవిడ నీ యిద్దరిపిల్లలకీ తల్లి. దీనికి నీకు చిన్నతనంలేదు. నీపాలిట దేవతలాంటి భార్యని నిర్లక్ష్యం చెయ్యటం అమానుషమన్న జ్ఞానంకూడాలేదు. దీనికి నీకు చిన్నతనంలేదు. ఆవిణ్ణి నీ భార్యగా పరిచయం చెయ్యడం నీకు చిన్నతనం. అవునా?"

నేను వెంటనే సమాధానం చెప్పకపోయేటప్పటికి, "గుడ్! ఆత్మపరిశీలన చేసుకుంటున్నా వన్నమాట. కంటిన్యూ. నేను లోపలికి వెళ్ళి లైంజ్యూస్ తెచ్చేటప్పడికి పశ్చాత్తాపంతో లెంపలేసుకోవాలి," అంటూ పూలమొక్కల మధ్య నుంచి యింట్లో కెళ్ళింది.

మేము చదువుకొనే రోజుల్లో, కాలేజీలో సంధ్యని ఆరాధించని విద్యార్థు లరుదు. ఎంచేతంటే, అందంతోబాటు తెలివైనదీ, చురుకైనదీ, మాటకారీ, పైగా రచయిత్రి. అప్పటికే ఆమెకథలు పేరుపడ్డ రచయితలు సయితం మెచ్చుకొనేవారు. ఆనర్స్ కోర్సులో నేనూ, గిరీ సంధ్యకి ప్రాణస్నేహితుల్లోజమ. గిరి ఆగర్భశ్రీమంతుడు, చాలా సరదా అయినవాడు; మంచి స్పోర్ట్స్మన్. ఆరోజుల్లో కారున్న విద్యార్థివా డొక్కడే. మే మిద్దరం ఎంత ప్రాణస్నేహితులమైనా గిరంటే అసూయ అజ్ఞాతంగా నాహృదయంలో దాంకుంది. దానికి కారణం సంధ్య వాడితోకూడా అంత సన్నిహితంగా వుండటమే. అసలు సంధ్య అందరితోనూ కలివిడిగా వుండేది. అయినప్పటికీ ఎవరికీ ఆమెతో అతిస్వాతంత్ర్యం తీసుకోడానికిగాని, వెకిలిగా ప్రవర్తించడానికిగాని అవకాశం యిచ్చేదికాదు. ఆవిధంగా అందరికీ అంత దగ్గరగా వుంటూ అతి నేర్పుగా ఎవరికీ అందని ప్రత్యేకస్థానాన్ని ఆక్రమించేది.

ఆనర్స్ ఫైనలియర్‌లో ఏవో చెప్పుడుమాటలు విని, నాకూ సంధ్యకీ మధ్య ఏవో ప్రేమకలాపా లున్నాయనుకొని మా మేనమామ పరిగెత్తుకొచ్చి, పెళ్ళిసంగతి తేల్చమన్నాడు. చిన్నప్పట్నుంచీ మా మేనమామ పోషణలోనూ, చెప్పుచేతల్లోనూ పెరిగాను. మా మేనమామకి ఒక్క కూతురుతప్ప సంతానంలేదు. ఆ కూతుర్ని నాకిచ్చి పెళ్ళి చేద్దామని ఆయన సంకల్పం. నేనుకూడా మరోలా ఆలోచించలేదు. కేవలం అది నా ధర్మంగా పాటించాను. అయితే ఆరోజు ఆయన ఆవేశంలో, "మేనల్లు డన్న అభిమానంతో చదువు చెప్పించి, పిల్లనిచ్చి పెళ్ళిచేసి, యీ ఆస్తంతా కట్టబెట్టి, ప్రయోజకుణ్ణి చేద్దా మనుకుంటే, నువ్వింత ద్రోహం తలబెడతా వనుకోలేదు. ఇప్పుడైనా మించిపోయిందిలేదు. నీ కిష్టం లేకపోతే వెంటనే చెప్పేసి నీదారి నువ్వు చూసుకో. నీపాటి మొగుడు దానికి దొరక్కపోడు," అని నిలదీసి అడిగేటప్పటికి, మొట్టమొదటిసారిగా నా స్వతంత్రం గురించి ఆలోచించాను. మా మేనమామ కూతుర్లో భార్యగా కోరుకోవడానికి తగ్గ ఆకర్షణ లేమీ లేవు. ఆమెను మనసారా అర్ధాంగిగా స్వీకరించడానికి నా మనస్సుకుకూడా సుముఖంగా కనపడలేదు. అంత్యనిష్ఠూరంకంటే ఆదినిష్ఠూర మే మంచిది కనక ఏమైనా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సక్రమమైన నిర్ణయం చేసుకోవాలన్న ఉద్దేశ్యముతో "రెండురోజులు వ్యవధిస్తే ఆలోచించి చెబుతాను," అన్నాను. దాంతో మా మేనమామ మండిపడి వెళ్ళిపోయాడు.

ముందు గిరిదగ్గర కెళ్ళేను. "నీచదువుకు కావలిస్తే నేను డబ్బిస్తాను. అలాంటి యిష్టంలేని పెళ్ళికి వొప్పుకోవద్దు," అని సలహా ఇచ్చాడు. తర్వాత సంధ్యదగ్గర కెళ్ళి జరిగిందంతా చెప్పాను. "నీ మేనమామ దయాను రాగాలమీద పెరిగి పెద్దవాడి వయ్యావు. నీకు నీతినియమాలమీద నమ్మకం, దైవభీతీ వుంటే ఆ అమ్మాయిని పెళ్ళాడు. ఆ అమ్మాయిని ప్రేమించి సుఖపెట్టడం మనిషిగా నీ కనీసధర్మం," అంది. ఆసలహాలో కనీసం సానుభూతికూడా కనబడలేదు. అంతవరకూ ఎన్నోసార్లు సంధ్య నా మీద చూపెట్టే ప్రత్యేక అభిమానంతో నన్ను ప్రేమిస్తోందేమోనన్న భ్రమ కలిగేది. అలాటి అవకాశానికీ అదృష్టానికీ నోచుకోలేదని తెలుసుండీ కూడా అలాంటి అర్హత నా కుందనే గర్వంతో సంతృప్తిపడేవాణ్ణి. ఈ దెబ్బతో కృంగిపోయాను.

ఆరోజు మొదలు సంధ్యపట్ల మొహం తప్పించుకు తిరిగేవాణ్ణి. సంధ్య కూడా ముభావంగా, జాలిగా నన్ను పలకరించేది. గిరికూడా మళ్ళీ నా పెళ్ళిప్రసంగం ఎత్తలేదు. తర్వాత వాళ్ళిద్దరి మధ్యా యీ ప్రసంగం వచ్చిందో లేదో తెలియదు. శలవుల్లో ఎలాంటి అట్టహాసం లేకుండా, నేను మా మేనమామ కూతుర్ని పెళ్ళాడేను. పెళ్ళాడిన తర్వతే చాలామంది మిత్రులకి తెలియబర్చేను. తరువాత నా పట్టుదల మీదే మాదంపతులం కలకత్తా వెళ్ళేం. ఓ వ్యాపారస్థుడికి భాగస్వామిగా స్థిరపడ్డాను. అదృష్టం బాగుంది. వ్యాపారం అభివృద్ధయింది.

సంధ్య ట్రేలో రెండు గ్లాసులతో లైంజ్యూస్, ఒక ప్లేట్లో సాల్టెడ్ బనానా చిప్స్ తీసుకొచ్చి టీపాయీమీద పెట్టింది. "మరి




లెంప లేసుగున్నట్టేనా," అంది మళ్ళీ రంగం లోకి దిగుతూ.

ఈ విషయానికి యింతటితో మంగళం పాడతానంటే లెంప లేసుకుంటా," నన్నాను లైంజూస్ గ్లాస్ అందుకుంటూ.

"అబ్రహాం లింకన్, మహాత్మా గాంధీల్లాంటి వాళ్ళను

మరిచిపోతుం దీలోకం. నువ్వో ప్రఖుడవనీ, నిన్ను గురించీ, నీ పెళ్లాం అందచందాలూ, చదువు సంధ్యలూ గురించి ఈ లోకం పట్టించుకుంటుందనీ నీ భ్రమ. అసలు మొదట్నుంచీ ఈ అహంభావం నీకున్న రెండు దుర్గుణాల్లోనూ ఒకటి."

"ఓహో! మరి రెండోదుర్గుణం ఏమిటి."

"చెప్పమన్నావా!"

"ఇప్పుడివన్నీ చెప్పమంటేనే చెబుతున్నావా?"

"అసూయ."

"అసూయా!"

"గిరంటే అసూయ పడేవాడివి. అవునా కాదా?"

"ఓ! గాడ్! గిరిదగ్గరకూడా యిలాగే అన్నావా?"

"లేదులే. గిరి నీఅంత తెలివైనవాడు కాదు. నీకున్నంత స్వార్థంలేదు."

"పోనీలే, నీ దృష్టిలో, మానవుల్లో మంచివాళ్ళుకూడా వున్నారు."

"నాన్‌సెన్స్! మనుషుల మంచితనంలో నా కెప్పుడూ నమ్మకముంది. నీలోపాలు నా కంటగట్టకు. ఉండు నీకు బుద్ధొచ్చి మీ యావిణ్ణి సహధర్మచారిణిగా గౌరవించేటట్టు మీ యిద్దరి పేర్లూ పెట్టి, ఓ నవల రాసి పడేస్తాను."

"నీకు పుణ్యం వుంటుంది. అంత పని చెయ్యకు. అందులోనూ నీ రచనలంటే మా ఆవిడకి వేదంతో సమానం. నువ్వు రాసిన పుస్తకాలన్నీ నిన్నడిగితెస్తానని మాటిచ్చేను."

"పోనీలే! మీ ఆవిడకేనా ఆ మాత్రం సంస్కారం వుంది. కలకత్తా తిరిగి వెళ్ళబోయేటప్పుడు యిక్కడికి మీ ఆవిణ్ణి తీసుకురా."

"చచ్చినట్టు."

"రైట్. అలాదారికిరా. నీకు బుద్ధి చెప్పాలని యిలాంటి అవకాశంకోసం ఐదేళ్ళబట్టీ ఎదురుచూస్తున్నా. ఈ పత్రికలు తిరగేస్తూ కూర్చో. యిప్పుడే వస్తా," అంటూ సమాధానమైనా చెప్పకుండా లేచి యింట్లోకెళ్ళింది.

ఇంట్లోకెళ్ళి స్విచ్ వేసినట్టుంది; మామిడి చెట్టుకు కృత్రిమమైన ఆకులూ, లతలతో తోరణంగా వేళ్ళాడుతూ అందంగా అమర్చబడిన లైటు వెలిగింది. అసలిందాకట్నుంచీ అక్కడ లైటున్నట్టే గమనించలేదు. టీపాయ్‌మీద పత్రికలు తిరగేస్తూంటే, అప్రయత్నంగా నాదృష్టి సంధ్య రాస్తూరాస్తూ వున్న కాగితాలకట్టమీద పడింది. తీశాను. నవలనుకుంటాను. 'స్వాతివాన' అని దానికి నామకరణం చేసింది. నూరుపేజీలు పైగా రాసింది. ఇంకా ఎన్నిపేజీలు రాయాలో తెలీదు. మొదట్నుంచీ నాకు తెలుగు పుస్తకాలంటే అభిలాష తక్కువ. మరి వ్యాపారంలో దినేక వార్తాపత్రిక చదవడమంటేనే బద్ధకం. ఆఖరి రెండుపేజీలు చదివాను. అందులో ఇలా వుంది:

"సరూ! నీ కేమయినా మతిపోయిందా! ఇన్నాళ్ళుగా మనందరికీ ఆప్తమిత్రుడూ, చదువూ, సంస్కారం, సిరిసంపదలూ, రూపం, గుణం అన్నీ వున్నవాడు—అలాంటి మధు తనంతట తనే వచ్చి పెళ్ళిమాటెత్తితే, ఇష్టం లేదని చెప్పి అవమానించి పొమ్మంటావా!"

"క్షమించన్నయ్యా! ఈపెళ్ళివల్ల ఇద్దరం సుఖపడకుండా పోతామని నచ్చచెప్పేనుకాని అవమానించి పొమ్మనలేదు. జన్మజన్మలకీ మధులాంటి స్నేహితుడు మనకి దొరకడు. అతనికి మనమీ దుండే అభిమానం తెలియందేమీకాదు. మేం పెళ్ళి చేసుకోనంతమాత్రాన విరోధులమైపోము."

"ఇన్నాళ్ళూ ఇంత చనువుగా, స్వేచ్ఛగా అతనితో సంచరిస్తూవుంటే..."

"మేం పెళ్ళిచేసుకుంటాం అనుకున్నావు! నే ననుకోలేదు. స్నేహానికి ప్రతిఫలం పెళ్ళయితే, నేను చాలామంది స్నేహితులతో యిలాగే సన్నిహితంగా కలిసిమెలిసి తిరిగాను..."

"అతన్ని పెళ్ళాడటానికి ఏమిటి నీ అభ్యంతరం?"

"విభిన్న జీవిత దృక్పథాలు."

"సరూ! నాక్కాస్త అర్థమయే భాషలో చెబుతావా!"

"మధుజీవితం ఆనందవినోదాలతో ఉద్రిక్తమైన జలపాతం. వ్యాపార వ్యవహారాలూ, విదేశపర్యటనలూ, విందులూ, వింతవింత విలాసాలూ, వ్యామోహాలూ వీటితోవిసుగూ, విరామం, విశ్రాంతీ కరువైన వాతావరణంలో బ్రతకడానికి పరిగెడుతూ, పాలు తాగే నేర్పు కావాలి. నా చేతకాదు. అతని జీవిత మహాప్రవాహ వేగానికి తట్టుకోలేను. నిత్యనూతన పర్వదినంగా తను సుఖపడుతూ, అతన్ని సుఖపెట్టగల జీవితభాగస్వామికి కావల్సిన ఆశయాలూ అభిరుచులూ వేరు."

"ఏమిటమ్మా యీ ధోరణి! తెలివైనదానివి; రచయిత్రివి. నీ సాహిత్యసేవకి కావల్సిన కథావస్తువులు కనిపించే విదేశయాత్రాలూ, వింతవింత అనుభవాలూ, రకరకాల మనుషులతో పరిచయాలూ—వీటన్నిటినీ కాలదన్నే దురదృష్టవంతురాల వనుకోలేదు."

"స్వానుభవాలద్వారా సాహిత్యకృషి చెయ్యాలంటే ఒకజీవితం చాలదు. మనస్సును ఆశ్రయిస్తే లభించనిభావాలు ప్రపంచమంతా ప్రదక్షిణం చేసినా లభించవు. ఇంద్రియాలు శరీరంతో సహకరించినట్టుగా మనస్సుతో సహకరించవు. మేధస్సును మేల్కొల్పకలిగింది దీక్ష; కళ్ళూ ముక్కూ నోరూ కాదు."

"మధుని పెళ్ళాడటానికిష్టపడని స్త్రీలు కూడా లోకంలో వుంటారని నా కివ్వాళే తెలిసింది."

"సహజంగా స్త్రీది మాతృహృదయం. ప్రేమ, పరిచర్య, సేవ, సహనం, త్యాగం స్త్రీకి స్వభావసిద్ధంగా వచ్చిన లక్షణాలు. వీటితో తను ఆరాధించగల పురుషుణ్ణే భర్తగా కోరుకుంటుంది. సుఖదుఃఖాలు పంచుకోడానికీ, సానుభూతికీ తనమీదే భర్త ఆధారపడా లనుకుంటుంది స్త్రీ. ఈ అవసరాలు లేకుండా విలాసానికే భార్య కావాలనుకున్న మనస్తత్వంగల పురుషుణ్ణి పెళ్ళాడ్డానికి సిద్ధ

పడే స్త్రీ చాలా సాహసవంతురా లయివుండాలి. దానికి కావల్సిన సంస్కారం వేరు.

"సరే, సరూ, నీకొక్కావల్సింది నువ్వు తెల్సుకుంటే చాలు."

"నా కిష్టమైంది చేతులారా విడిచిపెట్టుకునే టంత అవివేకురా ల్నంటావా! నా నిర్ణయంలో స్వార్థం వుందికాని త్యాగంలేదు. మధుకోసం నా జీవితపరమావధిని త్యాగం చెయ్యలేని స్వార్థపరురాల్ని."

"పోనీ సరూ! నీ కెలాంటి భర్తకావాలో నిర్ణయించుకున్నావా?"

"నా వ్యక్తిత్వాన్ని గుర్తించి నా అభిరుచుల్ని గౌరవించగల విద్యావంతుడు కావాలి. అప్పుడే మా జీవితాలకి సుఖం, శాంతీ, సంతృప్తీ లభిస్తాయి."

ఇది చదువుతుంటే సరూ, మధు పాత్రలలో సంధ్యా, గిరీ ప్రతిబింబాలు కనబడ్డాయి. ఆ కాగితాలకట్ట అక్కడ పడేసి గతాన్ని నెమరువేయడం మొదలెట్టేను.




నేను కలకత్తా వెళ్ళిపోయేముందు గిరి తండ్రి పోయేడు. ఏకైకపుత్రుడవడం మూలాన్ని గిరిమీద పడింది వ్యాపారబాధ్యతంతా. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వ్యాపారంలో చాకచక్యం, పేరుప్రతిష్టలూ సంపాదించేడు. ఇంటర్మీడియెట్‌లో సాధన కూడా మా క్లాస్‌మేటే. సంధ్యలాగే మాతో సరదాగా వుండేది ఆమె ఒక ఐ.సి.యస్. ఆఫీసర్ కూతురు. చాలాచలాకీ అయినది. అయితే సంధ్యకీ, సాధనకీ తేడా యేమిటంటే, సంధ్య స్వభావంలోనూ, వేషభాషల్లోనూ నిరాడంబరత్వం కనబడేది. సాధన రోజూ కోరకమైన దుస్తులు వేసేది. అందుకే 'ఫేషన్ పెరేడ్' అని విద్యార్థులు పేరెట్టేరు. మే మెవళ్ళమైనా మొహమ్మీదే ఆ పేరెట్టి పిలిస్తే చిరుకోపం నటించినా, లోలోపల గర్వపడుతున్నట్టు మొహమే చెప్పేది.

సంధ్యకి సంభాషణలో సహజమైన చాతుర్యము వుండేది. సంధ్యని అనుకరించడంలో సాధనమాటలు మొరటుగా వుండేవి.

ఆ రోజుల్లో మే మందరం క్లాసుల్లో లెక్చరర్లని నిర్దాక్షిణ్యంగా అల్లరి పెట్టేవాళ్ళం. ఈ విషయంలో మాతో సహకరించే ఆడపిల్లలకి లీడర్ సాధన. ఎకనమిక్స్ లెక్చరర్‌ని బుద్ధుడుమాస్టారనేవాళ్ళం. ఆయనవయస్సు పాతిగలోపు. క్లాసంతా గొల్లుమని గోలచేస్తున్నా చిరునవ్వుతో ఆయనపాఠం ఆయన చెప్పుకుపోయేవాడు. కొందరు మరీ బుద్ధిమంతులయిన కుర్రాళ్ళు, 'ఈయన కుర్రాళ్ళని అదపులో పెట్టలేకపోతున్నా డనీ, పాఠం వినబడ్డం లేదనీ' ప్రిన్సిపాల్‌తో రిపోర్ట్ చేశారుట. ఆయన్ని పిలిచి ప్రిన్సిపాలు చివాట్లు పెట్టేడుట. ఓసారి మాలో కొందర్ని ఇంటికి పిల్చి, అల్లరి మానెయ్యకపోతే ప్రిన్సిపాల్ ఉద్యోగం పీకేస్తాడనీ, తను బీదవాడననీ, అవీ యివీ చెప్పి వలవల యేడ్చాడు. మర్నాడు మే మందరం సమావేశమై అల్లరి మానెయ్యాలని తీర్మానం చేసుకున్నాం. సాధనకూడా ఆ సమావేశంలో

ఉపన్యాస మిచ్చింది. నిజానికి మాలో ఓ మానసికవిప్లవం తీసుగొచ్చిందా సంఘటన. దాంతర్వాత విద్యార్థుల అల్లరి చాలాభాగం తగ్గిపోయింది.

ఇంటర్‌పరీక్ష లయినపోయిన తర్వాత మేము ఆనర్స్‌లో చేరాం. సాధన తండ్రితో ఢిల్లీ వెళ్ళిపోయి అక్కడ బియ్యే పాసయి, తర్వాత తండ్రి విదేశ రాయబార వర్గంలో నియోగితు డవగా, అమెరికాలో రెండేళ్ళుండి తిరిగివచ్చింది. ఆ తర్వాత ఆయన వుద్యోగానికి రాజీనామా యిచ్చి ఓ అమెరికన్ కంపెనీ సహాయ సహకారాలతో ఈ వూర్లో ప్లాస్టిక్ సామానులపరిశ్రమ స్థాపించేడు. అందులో గిరికూడా భాగస్వామి అవడంవల్ల సాధనతో పూర్వపరిచయం ప్రణయంగానూ, తదుపరి పరిణయం పరిణమించి రెండేళ్ళు దాటింది.

కాని సాధన తిరిగిరాకపోతే గిరి తప్పకుండా సంధ్యను పెళ్ళాడేవాడేమో. సంధ్య రాసినకథలో సరూ మధుని పెళ్ళాడ్డానికి నిరాకరించడంలో ఉద్దేశం, తనని గిరి పెళ్ళాడకపోవడం తనకే మంచిదైనట్లు అభూత కల్పన చెయ్యడ మనుకుంటా. ఏమైనా చేదు ద్రాక్షపళ్ళకథ మరోసారి జ్ఞాపక మొచ్చింది.

టైమ్ చూస్తే ఏడయింది. ఏడింటికల్లా క్లబ్బుకి డిన్నర్‌కి రమ్మని గిరీ, సాధనా పిలిచేరు. తప్పకుండా వస్తానన్నాను. లేచి నెమ్మదిగా అడుగులేసుకుంటూ ఇంట్లో కెళ్ళేను. నేను రావడం గమనించి సంధ్య వంటా వడ్డనాగురించి పనిమనిషికి ఏవేవో పురమాయించి, నన్ను కలుసుకుని ఇల్లంతా చూపెట్టింది. ఇంట్లో వున్న వస్తుసామగ్రి చాలా సాధారణమైనవైనా గృహనిర్వహణలోనూ అలంకరణ పద్ధతిలోనూ ఏదో ప్రత్యేకతుండటంవల్ల ఇల్లంతో అందంగా కనబడింది. మెట్లు దిగి మామిడిచెట్టు వైపుకు వస్తూండగా.

"మేస్టా రిప్పుడే వస్తానని ఫోను చేశారు. ను వ్వొచ్చేపని చెప్పాను. గిరి, సాధన క్లబ్‌లో వున్నారు. డిన్నర్‌కి నువ్వక్కడికి రావటం లేదనీ, యిక్కడే మాతో భోంచేస్తున్నా వనీ ఫోను చేశాను. వాళ్ళనికూడా రమ్మన్నాను. వీలుపడదన్నారు." అని సంధ్య అనగానే కిక్కురుమనకుండా కుర్చీలో కూలబడ్డాను. శీతాకాలమేమో చలిచలిగా వుంది. క్లబ్‌కి వెళ్ళి స్నేహితుల్తో బాతాఖానీ కొడుతూ కాస్త వేడిపుట్టడానికి డ్రింక్స్ తీసుకుందామనుకున్నాను. కాని యింక సంధ్య ఆతిథ్యాన్నించి తప్పించుకోడం నా తరం కాదు.

కూర్చున్నతర్వాత మాతోటివిద్యార్థుల్ని గురించీ, స్నేహితుల్ని గురించీ పేరు పేరునా వా ళ్ళెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ, ఎలావున్నదీ, వాళ్ళ పెళ్ళిళ్ళగురించీ ఎన్నో వివరాలతో సంధ్య చెబుతూంటే నా చెవులు నేను నమ్మలేకపోయాను. వాళ్ళ మంచిచెడ్డల్ని గురించీ, కష్టసుఖాలను గురించీ కుతూహలంతో అన్నివివరాలనూ సేకరించి, ఏదో తన్మయత్వంలో సంధ్య చెప్పడం చూస్తూంటే, నా స్వార్థం సంకుచితత్వం గ్రహించి, నేనే సిగ్గుపడ్డాను. ఎనిమిది దాటింది. గేటు తీసుకుని బుద్ధుడు మేస్టారొచ్చారు. మేము లేచి నిలబడ్డాం. నన్ను చూసి అక్కణ్ణుంచే పలకరిస్తూ దగ్గిరకొచ్చి కరస్పర్శ చేసి, ఆప్యాయంగా కౌగలించుకుని కుర్చీలో కూర్చోపెట్టారు. మేస్టారుకేసి ఒక సారి పరీక్షగా చూశాను. ఆయనలో కలిగిన మార్పుకు చకితు ణ్ణయ్యేను. ఆయన యిది వరకటి పిరికిమాస్టారు కాదు. ఆయనలో ఏదో ఒక ఠీవీ, హుందాతనం, ఆ చిరునవ్వులో ఒక బలవత్తరమయిన ఆకర్షణా కనబడ్డాయి. ఒక్కక్షణం పిరికివిద్యార్థి లాగ మాట్లాడలేక కుర్చీలో కూర్చుని ఆయనకేసి వింతగా చూశాను.

మేస్టారు ఏదో సన్మానసభకి వెళ్ళేరుట. ఫుల్‌సూట్‌లో వున్నారు. "ఇంత చలిగాల్లో స్వెట్టరయినా వేసుకోకుండా కూర్చున్నావు. ఇంద ఈ కోటు వేసుకో," అంటూ ఆప్యాయంగా మేస్టారు తనకోటు సంధ్యవెనక నిలబడి బుజాలమీద కప్పేరు. కృతజ్ఞతతో తన భుజంమీదవున్న మేస్టారు చేతివేళ్ళని తలవంచి తన చెంపతో సంధ్య స్పృశించడం నేను చూడకపోలేదు. సంధ్య కూర్చున్నాక నా కుర్చీకి దగ్గిరగా కుర్చీ లాక్కుని కూర్చున్నారు మేస్టారు. ఆయనకూడా రకరకాల ప్రశ్నలు వేశారు. మొదట్లో ఆయనమాటల్లో తొణికిసలాడే ఆదరణాభిమానాలు అసహజంగా, అతిశయంగా కనబడ్డా, తర్వాత ఆ మార్పంతా సంధ్యా సహచర్యంవల్ల వొచ్చిందని గ్రహించేను. భోజనా లయిం తర్వాత మళ్ళీ కబుర్లు మొదలెట్టేం. కాస్సేపున్నాక బడలికగా వుందని క్షమాపణ చెప్పుకుని మేస్టారు లోపలి కెళ్ళి పడుకున్నారు. సంధ్యా నేనూ చాలా రాత్రివరకు మాట్లాడుకుంటూ కూర్చుని, క్లబ్‌నుంచి యింటికి బయలుదేరుతున్నట్టు గిరి దగ్గర్నుంచి ఫోన్ వచ్చేక, నేనూ గిరియింటికి బయలుదేరేను.

దార్లో సంధ్యా మాస్టార్లని గురించి ఆలోచించేను. వాళ్ళ పెళ్ళయి రెండు సంవత్సరాలు దాటింది. వా ళ్ళొకళ్ళ నొకళ్లు ఆప్యాయంగా పలకరించుకోవడంలోనూ, ప్రతీ చిన్నవిషయంలోనూ ఒకళ్ళను గురించి ఒకళ్లు తీసుకునే శ్రద్ధా, సంభాషణలోకూడా ఒకళ్ళ భావాలని ఒకళ్ళు సమర్థించుకుంటూ అభినందించుకుంటూ వుండటం — ఈ దృశ్యాలు ఇంకా కళ్ళకి కట్టినట్టు కనబడుతున్నట్టే వున్నాయి. భార్యాభర్తల్లో ఇంత అన్యోన్యత సాధ్యమా? లేకపోతే జీవితంలో సుఖశాంతులు సాధించేమని అందరూ అనుకోవాలని సంధ్య అలవాటు చేసుకున్న నటనా? అన్న అనుమానం కలిగింది. ఏమైనా మేస్టా రదృష్టవంతు లనుకున్నాను.


* * *

"గిరీ! నిన్నటి క్లబ్బు విశేషా లేమిటి? సంధ్య నాతో చెప్పకుండా నేను రావటం లేదని నీకు టెలిఫోన్ చేసి, నన్ను బలవంతంగా ఆపేసింది. మిమ్మల్నికూడా రమ్మంటిదిగా;" అన్నాను ఉదయం కాఫీ తీసుకుంటూ.

"వద్దామని ప్రయత్నం చేశాం. దాని కూ్కడా అదృష్టం వుండాలికద! క్లబ్బంటే రోతపుడుతుంది. ఒకటే అల్లరి, గోల, తాగుడు, తిండీ, పేకాట, వేళాకోళాలూ, వెక్కిరింతలూ, చాటుచాటుగా విమర్శలూ, రహస్యమంటూ రికమండేషన్లూ, రకరకాల అభినందనలూ, పరామర్శలూ... హృదయానికి తాళం వేసి, ఇదంతా ఆనందం అనుకుంటూ నోటితో తాళం వెయ్యటం — ఇదీ క్లబ్బులో వాతావరణం! వ్యాపారం-గొడవలతో బుర్ర వేడెక్కి మనశ్శాంతి కంటూ క్లబ్‌కి వెళ్ళి బుర్ర బద్దలయ్యే తలనొప్పితో యింటికి రావడం! డామిట్! క్లబ్‌కి వెళ్ళడమంత ఘోరమైన వ్యసనం మరోటి కనబడలేదు. అదృష్టవంతుడివి. ఓ సాయంత్రమైనా ప్రశాంతంగా సంధ్యా సాన్నిధ్యంలో గడిపేవు. సంధ్యతో ఓగంట కబుర్లు చెప్పడం నిజంగా టానిక్‌లాంటిది! ఇవ్వాళ సాయంత్రం వెడతాను."

"ఏమి టానిక్కోకాని, వెళ్ళినప్పట్నుంచీ నన్ను దులిపేసింది."

"అప్పుడప్పుడు నన్నూ అంతే చేస్తుంది. నిజానికి మన కంతకంటే ఏం కావాలి! ఆమాత్రం వుపకారం చేసేవాళ్ళెవరు! ఎంతసేపూ మనల్ని స్తోత్రం చేసేవాళ్ళూ, మనం మాట్లాడితే విరగబడి నవ్వుతూ బ్రహ్మానందపడుతున్నట్టు నటించే వాళ్ళూ, మనకంటే గొప్పవాళ్ళయితే ఆపని మనం చెయ్యడం — ఇవీ మన బ్రతుకులు. మన జీవితాలు గమ్యంలేని పరుగుపందాలేమో అనిపిస్తుంది. ఏవేవి ఆనందదాయకమైన అనుభవా లనుకున్నామో అవన్నీ మొహం మొత్తి, కొత్త అనుభవాలకోసం వేట! మనకంటే భోగా లనుభవిస్తున్నా రనుకున్నవాళ్ళకంటే భోగా లనుభవించాలని కోరికలు, అవి సాధించడానికి ఆతృత, అసాధ్యమయితే నిరాశ! ఏది ఆనందం కాదని మనం గ్రహించేమో అదే ఆనందమని ఆత్మవంచన చేసుకుంటూ ఈ పట్టాల




మీద మన జీవితంరైలు నడపడాని కలవాటు పడిపోయేం."

"నాకు తెలియకడుగుతాను: ఈ మెట్ట వేదాంతం పట్టుకు ఏడవకపోతే, అంత సంధ్యంటే పడిచచ్చేవాడివి ఆమెనే పెళ్ళాడకుండా సాధన నెందుకు పెళ్ళాడేవు?" నిలదీసి అడిగేను సంగతేమిటో తెలుసుకుందామని.

"సంధ్య నన్ను పెళ్ళాడ్డానికి ఒప్పుగోకపోతేనే, సంధ్య సలహామీద సాధనని పెళ్ళాడేను."

"నిజంగా! అరే! సంధ్య నిన్ను ప్రేమించినదనుకున్నాను!"

"సంధ్య మనసారా ప్రేమించింది సాహిత్యాన్ని. తన సాహిత్యసేవకి పనికొచ్చే మానవుల మనస్తత్వాలూ, సాంఘిక ఆచారాలూ, సామాజిక పరిణామాలూ పరిశోధించడానికి అవసరమైన ప్రయోగాలు జరుపుకోడానికి పనికొచ్చే పెంపుడుకుందేళ్ళం మనం. మనం ఆమెను మోహించేం. మనల్నందరినీ ఆమె ప్రేమించింది. మన అందరి శ్రేయస్సునూ అభిలషించే నిజమైన స్నేహితురాలు. మేధావంతురాలు. మన జీవితావసరాలను మనమే తెలుసుకోలేని అంధులం మనం. రెండు కళ్ళూ తెరుచుకుని తన జీవితపథాన్ని ఎంచుకుంది సంధ్య. జీవితంతో సమాధానపడే చాకచక్యం ఆమెకుంది. అసంతృప్తిని జయించింది. శాంతిని సాధించింది. సంధ్య జీవితంలో ఓ సంపూర్ణత వుంది."

"నాన్‌సెన్స్! ఏమిట్రా యీ తన్మయత్వం! మనకి నీతులు చెబుతుంది, సరే, తను నిజంగా కోరుకున్న జీవితం ఇదే అంటావా! నాపుద్దేశం యిది నటనేమో అని. లేకపోతే అసలు 'సెక్స్ ఇన్‌స్టిన్‌క్ట్' తక్కువేమో! నిజంగా బుద్ధుడు మేస్టార్ని మోహించి పెళ్ళాడిందంటావా!"

"ఒకప్పుడు సంధ్య ఓ యువకుణ్ణి మోహించింది. కాని వాడు ఆత్మవిశ్వాసం లేని పిరికివాడు. జీవితం విధివశ మనుకునే మనస్తత్వం వాడిది."

"ఎవడ్రా వాడూ! మనం ఎరుగుదుమా!"

"ఎరుగుదుం. చెబుతాను. చాలా రహస్యంగా వుంచాలి."

"ఓ యస్, చెప్పు."

"నిన్నే మోహించింది."

"నన్నా!" అన్నాను ఉలిక్కిపడి."

"అవును. ఒకనాడు చెప్పింది.' నువ్వు ఆనర్స్‌లో చేరేముందర మీ మేనమామ డబ్బుమీద ఆధారపడి చదవడమా. మానడమా అని తటపటాయించినప్పుడు ఎన్నోసార్లు తనదగ్గిర డబ్బుందనీ, తనకి నా అన్నవాళ్ళు లేరనీ, మేనమామ సహాయం అర్థించొద్దనీ బ్రతిమాలిం దటగా! కాని

ఆమె ఆంతర్యం గ్రహించలేని మూర్ఖుడివి. ఆతర్వాత మూడేళ్ళా మీ మేనమామ డబ్బుతో చదువుకుని ఆఖరి రోజుల్లో మీ మేనమామతో నీ పెళ్ళి విషయంలో దెబ్బలాడి సంధ్య సలహా అడిగేవుట. అప్పటి కప్పుడే నువ్వో చచ్చుపీనుగవని గ్రహించి వెర్రి వెర్రి వేషా లేయకుండా మేనరికం చేసుకోమని సలహా యిచ్చిందిట! అవునా!"

'అవును' అని నేను సమాధానం చెప్పక్కర్లేదని గిరికికూడా తెలుసు.

మేమిలా మాట్లాడుతుండగా చేతులో ఓ అరటికాయల అత్తం, రెండు పొట్లకాయలూ తీసుకుని సంధ్యయింట్లో వుండే పనిమనిషి వస్తూండడం కిటికీలోంచి చూశాను. రెండూ ఓ చేతిలోకి తీసుకుని దిక్కులు చూసి తటపటాయిస్తూ, మొలలోంచి ఓ నీలిరంగు కాగితం మడత పైకి తీసి, రహస్యంగా అరచేతిలో నొక్కిపట్టుకుని, హాల్లోకి వచ్చింది. హాల్లోకి వచ్చేక గిరి ఆమెను చూసి దగ్గిరకెళ్ళి "ఓ! సంధ్య పంపిందా! థేంక్స్ అనిచెప్పు," అని 'సాధనా; సాధనా' అంటూ లోపలికెళ్ళేడు, నేను నా గదిలో కెళ్ళిపోయాను.

బట్టలు వేసుకుని బయటికి వెడదామనుకుని మెట్లు దిగేను. నాలుగడుగులు వేసేటప్పటికి అప్రయత్నంగా నా దృష్టి గోడవార పడున్న నీలిరంగు కాగితంముక్కలమీద పడింది. అవి ఏరి జేబులో పెట్టుకుని ఏదో మరిచిపోయినట్టుగా గదిలోకి వెళ్ళి తలుపు జారేసి కాగితమ్ముక్కలు జాగర్తగా బల్లమీద పరచి, సరిగ్గా సర్ది చదివేను. కాగితం అంతా ఖాళీ-మధ్యమాత్రం "ఈరోజు రాత్రి ఎనిమిది గంటలకి" అని మాత్రం వుంది. సంతకం లేదు. పైగా పొడక్షరాలు. గిరి ఉదయం కాఫీ తాగుతున్నప్పుడు, ఇవ్వాళ సాయంత్రం సంధ్యను చూడ్డానికి వెడతానన్న మాటలు జ్ఞాపక మొచ్చాయి. టెలిఫోన్‌లో చెప్పకుండా పనిమనిషిద్వారా పంపిన సందేశమంటే ఊహించలేని రహస్యంకాదు. కాగితంముక్కలు కిటికీఅవతల గిరవాటెట్టి తలుపు తెరచుకుని బయటకొచ్చేటప్పటికి, వరండాలో సాధన కూర్చుని వుంది. సాధనతో కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయేను. మాటల సందర్భంలో సంధ్య ప్రసక్తి తీసుకొచ్చేను. సాధన మాటల్లో సంధ్యమీద గౌరవంకంటే మేష్టారుమీద సానుభూతి అజ్ఞాతంగా కనబడింది.

* * *

మళ్ళీ సంధ్యను కలుసుకుని ఆరు సంవత్సరా లయింది. ఆరోజు సాయంత్రం వాళ్ళింటి కెళ్ళి విచారిస్తే, అరగంటలో వస్తారు కూర్చోమన్నారని పనిమనిషి చెప్పింది. పూలతోట ఆరేళ్ళ క్రితంకంటే ఇప్పుడు దట్టంగా పెరిగింది. రకరకాల రంగురంగుల పూలచెట్లు వింత వింత ఆకారాలతో కత్తిరించబడి మనోజ్ఞంగా వున్నాయి. మామిడిచెట్టుకింద కుర్చీలో కూర్చున్నాను. రెండేళ్ళక్రితం యిక్కడి కొచ్చినప్పుడు సంధ్యలేదు. సంధ్యా మేష్టారూ శలవులకి బంధుమిత్రులను సందర్శించే పర్యటనలో వున్నారుట. దీనికి సాయం గిరికి ఊపిరితిత్తుల్లో కాన్సర్ వ్యాధి సోకిందనీ, చికిత్సకోసం, సాధనా గిరీ రెండు రోజులక్రితమే స్విట్జర్‌లాండ్ వెళ్ళేరనీ తెలిసింది. నాలుగురోజులు వుందామని వచ్చినవాణ్ణి మర్నాడే బయలుదేరి వెళ్ళిపోయేను.

మూడేళ్ళక్రితం మా కంపెనీ ఒక ఇటాలియన్ కంపెనీతో భాగస్వామిగా చేరింది. కలకత్తాలో భారీఎత్తున పరిశ్రమ స్థాపించడానికి ఆ కంపెనీ డైరెక్టర్లతో సంప్రదింపులు జరపడానికి నిరుడు నేను 'మిలాన్' వెళ్ళవలసి వచ్చింది. గిరికి యీ విషయం రాశాను. నేను స్విట్జర్లాండు రావడానికి తను ఏర్పాట్లు చేస్తున్నాననీ, సాధన నన్ను రోమ్‌లో కల్సుకొని కూడా తీసుకొస్తుందనీ రాశాడు. అన్నట్లుగానే నేను రోమ్‌లో ప్లేన్ దిగగానే సాధన కనబడింది. మా వ్యాపారసంస్థ ప్రతినిధులకి సాధనని పరిచయం చేశాను. సగౌరవంగా సాధననికూడా మా సమావేశ సందర్భంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందుకు ఆహ్వానించేరు. సాధన స్విట్జర్లాండ్ వచ్చి సంవత్సరమైందేమో-ఈ ప్రాంతాలన్నీ ఇదివరకే చూసేసింది. రోమ్‌లో చరిత్రాత్మకమైన ప్రదేశాలన్నీ సందర్శించి సాయంత్రానికి మిలాన్ చేరాము. మా సంప్రదింపులు చాలా అనుకూలంగా ఫలించేయి. ఒప్పందాలపై సంతకాలు పెట్టిన తర్వాత వాళ్ళ బలవంతం మీద రాత్రి మిలాన్‌లో ఉండక తప్పలేదు.

ఉదయం సాధనతో మిలాన్‌నుంచి జెనీవాకు కార్లో బయలుదేరేము. ఆరోడ్డు పదహారువేల అడుగుల ఎత్తైన మౌంట్ బ్లాంక్ పర్వతముకింద దొలిచిన సొరంగంగుండా వెడుతుంది. ఏడుమైళ్ళ పొడవైన ఆ సొరంగం ప్రపంచంలోకెల్లా పెద్దది. సొరంగాని కిటు ఇటలీదేశం, అటు ఫ్రాన్సు దేశం. సొరంగంలో చీకటి, సుడిగాలి, జలధారలు మొదలయిన ప్రకృతిశక్తులను నిరోధించడానికి అద్భుతమైన అధునాత యంత్రాలూ,పరికరాలూసమకూర్చబడ్డాయి. ఇటు ఇటలీ, అటు ఫ్రాన్సు ఈ ఉభయ దేశాలు కలిసి సాధించిన ఘనవిజయం ఇది. దీని నిర్మాణంలో రోజుకు అయిదులక్షల మంది ఆరు సంవత్సరాలు పని చేశారుట.

మొదట్లో సాధనా గిరీ జెనీవా దగ్గిర వైవర్ సరస్సు తీరాన్ని చర్చ్‌గేట్ కాలనీలో టూరిస్టుకాటేజీ తీసుకుని వున్నారుట. కాని గిరికి ఆపరేషన్ చేసి ఒక ఊపిరితిత్తి తీసెయ్యవలసి వచ్చినతరువాత స్విట్జర్లాండ్ ముఖ్యపట్టణమయిన బెర్న్ నగరంలో ప్రపంచ ఆరోగ్యసమితి (W. H. O) ఆధ్వర్యాన నిర్వహింపబడుతూన్న కేన్సర్ హాస్పిటల్‌లో గిరిని చేర్చి 'రోన్ వ్యూ' అనే ఇంగ్లీషు హోటల్లో సాధన ఉంటుందిట. హోటెల్ ఎత్తైన కొండమీద వుంది. అక్కడనుంచి మెలికలుతిరుగుతూ ప్రవహిస్తున్న రోన్‌నది దూరంగా కనబడుతుం

డటం మూలాన్ని రోన్ వ్యూ అనిపేరెట్టేరు. సారవంతమైన రోన్, రైన్ నదుల లోయలు సస్యశ్యామలమై పంటల పైర్లూ, ఫలవృక్షాలూ, పూలమొక్కలూ, పచ్చిక బీళ్లూ, పచ్చని మైదానాలతోనూ అడుగడుగునా పార్కులతోనూ మనోజ్ఞమైన దృశ్యాలతో చూపరులకు కన్నులవిందు సమకూరుస్తాయి. అక్కడ ప్రజల్లో సోమరితనం మచ్చుకుకూడా కనబడదు. వ్యవసాయం, వ్యాపారం, పరిశ్రమలూ— అన్నీ అత్యంత అభివృద్ధిని సాధించిన దేశం.

గిరి ఆనవాలు పట్టలేనంత చిక్కిపోయేడు. ముఖంలోమాత్రం జీవితాన్ని వెక్కిరిస్తున్నట్టు చిరునవ్వు తొణికిసలాడుతూంది. ఆవేశం, ఉద్రేకం కలిగించేవార్తలు అతనికి చెప్పకూడదనీ, అతనిలో దీర్ఘ సంభాషణలు కానీ, చర్చలుకానీ చెయ్యకూడదనీ నర్స్ చెప్పింది. గిరి పడకమంచం మీద కూర్చుని వాడిచెయ్యి నా రెండుచేతుల్లోకి తీసుకోగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగి, బొటబొటా కన్నీళ్ళు కార్చేను. గిరి నెమ్మదిగా లేచి కూర్చుని, నా చెవి పట్టుకుని ఊపుతూ, "ఓరి చవటా! నన్ను ఓదార్చి ధైర్యం చెబుతావనుకుని నిన్ను రమ్మంటే, నిన్ను నేను ఓదార్చవలసివస్తూందే!" అన్నాడు. నాకు ఏడవాలో, నవ్వాలో, అర్థంకాలేదు. గిరి మొహంలో మందహాసం చూసి మరోసారి ఆశ్చర్యపోయాను. గిరి మంచంపక్కనే వున్న రివాల్వింగ్ బుక్ షెల్ఫ్‌మీద వున్న పుస్తకాలే గిరిలో పరివర్తనకి జవాబై వుండాలి. ఓ షెల్ఫ్‌లో రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరవింద్ ఘోష్ వాళ్ళ చరిత్రలూ, బోధనలూ, తత్వాలూ, తర్కవితర్కాలూ, మరో షెల్ఫ్‌లో సంధ్యారచనలూ, మరో షెల్ఫ్‌లో సంక్షిప్త మత గ్రంథ సారాంశాలూ, మరో షెల్ఫ్‌లో ఫోటో ఆల్బమ్‌లూ, ఉత్తరాలూ.



పావుగంట వగానే మమ్మల్ని బయటికి వెళ్ళిపొమ్మని నర్స్ ఆజ్ఞ చేసింది. నేను లేవకపూర్వమే అప్రయత్నంగా గిరి తలగడా కిందనుంచి 'జ్ఞానయోగ' అన్న పుస్తకాన్ని పైకి తీసేడు. అదే చిరునవ్వుతో నా చెయ్యి చరిచి, నా చేతిని నా కోటుజేబులోకి తోసేడు. చేతికి ఏదో కాగితం తగిలింది. గిరి కళ్ళల్లో రహస్య మన్నభావం కనబడి సాధనతో బయటకు నడిచేను. రాత్రి హోటల్లో సాధన చూడకుండా దాన్ని తీసి చదివాను. ఇలా వుంది "నాకో ఉపకారం చెయ్యాలి. అందుకే నిన్ను రమ్మన్నాను. బలవంతంగానైనాసరే సాధనని ఇండియాకి తీసుకుపో... ఆమె నన్ను మరచిపోవాలి. ఆమె స్వేచ్ఛకి అడ్డులేకుండా చూడు. నేను జీవించబోయే ఈ కొద్దిరోజులయినా నన్ను సంతృప్తిగా జీవించనియ్యి. వాదించకు, వారించకు. శాశ్వతంగా— నీ గిరి."

దూరంగా డాన్స్ మ్యూజిక్ వినబడుతూంది. అప్రయత్నంగా నా కళ్ళు సాధన పాదాలమీదకు పోయేయి. డాన్స్ ట్యూన్‌కి తగ్గట్టు పాదాలతో తాళం వేస్తోంది. నీగ్రో వెయిట్రెస్‌తో డిన్నర్ గదిలోనే సర్వ్ చెయ్యమని చెప్పి, సాధనగదిలో కూర్చుని 'షాంపెయిన్' తీసుకుంటున్నాం. నేనుకాని

సాధనకాని గిరి ఆరోగ్యం గురించి ఎక్కువగా మాట్లాడలేదు. అట్టేకాలం బతుకుతాడని ఎవళ్ళం అనుకోలేదు. మేము డ్రింక్స్ తీసుకుంటూండగా వెయిట్రెస్ రెండుసార్లు పువ్వులగుత్తులూ కార్డులూ పట్టుకొచ్చింది. అవి డాన్స్ చెయ్యటానికి ఆహ్వానా లనుకుంటాను. బయట కెళ్ళి వాళ్ళని పంపించేసింది. ఒక్క స్త్రీ దేశం కాని దేశం వచ్చి నిరాశా ప్రవాహాని కెదురీదుతూ జీవితాన్ని సాధ్యమైనంత ఉత్సాహంగా గడపగలసాధన చిత్తస్థయిర్యాన్ని అభినందించకుండా వుండలేకపోయాను. మాటల సందర్భంలో సంధ్య దగ్గర్నుంచి తరచు గిరికీ, తనకీ వుత్తరా లొస్తున్నాయని చెప్పింది. గిరిలో అంతరంగికంగా ఆశా నిరాశల కతీతమైన ప్రవృత్తి కలగడానికి కారణం సంధ్య రాసిన వుత్తరాల ప్రభావమే అంది.

"గిరి సంధ్యను మనసారా ప్రేమించాడు. కాని సంధ్య వాడి ప్రేమను తృణీకరించింది," అన్నాను – సంధ్యని పెళ్ళాడితే గిరిజీవితం ఎలా వుండునో అని ఆలోచిస్తూ.

"సంధ్య, గిరి పెళ్ళిని తృణీకరించింది కాని ప్రేమనికాదు," అందిసాధన ఆలోచితంగానో, ఆనాలోచితంగానో.

"అంటే వాళ్ళిద్దరి మధ్యా రహస్య ప్రణయం ..."

"ఛీ ! ఛీ ! అలాంటి దేమీలేదు. ఒకప్పుడలాగే అనుమానపడ్డాను. గిరి సంధ్యారాధనను చూసి అసూయపడ్డాను. వాళ్ళు తరచు సాయంత్రం ఏకాంతంగా కలుసుకోడం గురించీ, వాళ్ళ ప్రవర్తననీ శంకించేను. కాని మేస్టారు తెలివైనవాడు. ఆయనకి సంధ్య సౌశీల్యంలో అచంచలమైన విశ్వాసం. నాతో వాదించేరు. ఓసారి రుజువు చేస్తా నన్నారు. ఐదారేళ్ళ క్రితం ఓరోజున వాళ్ళిద్దరూ సాయంత్రం కలుసుకుంటారని తెలుసుకునీ, వాళ్ళ మాటలన్నీ టేప్‌రికార్డ్ చెయ్యమని మేస్టారితో చెప్పి రహస్యమైన ఏర్పాట్లు చేశాను. రాత్రి ఎనిమిదింటికి రమ్మనమని నాకు రహస్యంగా




కబురంపేరు. అనుకున్నట్టుగానే ఆరింటికక్కడి కొచ్చి, ఎనిమిదింటికి గిరి క్లబ్బుకెళ్ళిపోయాడు. ఏమీ తెలియనట్టుగా ఎనిమిదింటికి వెళ్ళి సంధ్య యింట్లో కెళ్ళేక రహస్యంగా టేప్ రికార్డరు తీసి దాచేసి, సంధ్యతో కబుర్లు చెప్పి వెళ్ళిపోయి, రాత్రి వాళ్ళ మాటలన్నీ విన్నాను. మేస్టారికి క్షమాపణ చెప్పుకున్నాను," అంది సాధన; ఎన్నాళ్ళబట్టో నన్ను పీక్కు తింటున్న ఆ సీలం కాగితంలోని సందేశం తాలూకు సందేహం పటాపంచలు చేస్తూ

మర్నాడు ఉదయం నాతో తిరిగివచ్చేయమని సాధనకి బోధించేను. గిరి బ్రతకడం దుర్లభమనీ, త నిలా జీవితం వ్యర్థం చేసుకోకుండా తమకంపెనీ డైరక్టర్‌గా బాధ్యత నిర్వహించమనీ, గిరిని ఒప్పిస్తాననీ ఎన్నో చెప్పాను. ఒప్పుకోలేదు. ఇది గిరి తుది కోరిక. అంచేత మన్నించమని గిరి రహస్యంగా అందించిన వుత్తరం చూపెట్టేను. చాలా సేపు ఆలోచించి తన నిర్ణయం మర్నాడు చెబుతాననీ, యీ విషయం గిరికి చెప్పొద్దనీ బతిమాలింది. మార్నాడు గిరితో ప్రయత్నిస్తున్నా నన్నట్టు సౌంజ్ఞ చేశాను. మర్నాడు ఉదయం నాగదిలోకొచ్చి ప్రయాణానికి తను సిద్ధంగా వున్నట్టూ, అయితే తన నిర్ణయం మనస్సుకు విరుద్ధంగా చేసినట్టూ, యీ నిర్ణయంతో మనస్సు సమాధానపడటానికి వ్యవధి కావాలనీ, అందుచేత అక్కణ్ణుంచి ఫ్రాంస్ వెళ్ళి 'మార్సీల్స్'లో ఓడ యెక్కి, ఇండియా వెడదామనీ చెప్పింది.

మా నిర్ణయం గిరికి చెప్పేను. సంతోషించేడు. అనుకున్నట్టుగానే నాలుగురోజుల్లో 'మార్సీల్స్'లో 'స్ట్రాత్‌మోర్' అనే బ్రిటిష్ ఓడ ఎక్కాము. రిజర్వేషన్సుకూడా సాధనే సాధించింది. ఫలానారోజున బొంబాయి చేరుతున్నామని మిత్రులకి వుత్తరం రాశాను. కలకత్తాలో మా ఆవిడకి విషయాలన్నీ రాశాను. మరో డైరక్టర్‌కి మా కంపెనీ సంప్రదింపులు గురించీ, ఏ పరిస్థితుల్లో నేను పదిహేనురోజులు ఆలస్యంగా వస్తున్నదీ రాశాను. మార్సీల్స్ ప్రయాణానికి కావల్సిన పోర్ట్‌వైను, ఏపిల్స్, ఎండుద్రాక్ష, అక్రూట్ వగైరాలు కొనుక్కుని ఓడ ఎక్కేం. సాధనకిది రెండోసారి ఓడ ఎక్కడం. కాని నాకిది మొదటిసారే.

రెండురోజులు ప్రయాణం చేసేటప్పటికి విపరీతమైన అలసటా, కడుపులో దేవినట్టు వికారం, నీరసం, జ్వరం వచ్చేయ్. షిప్ మెడికల్‌ఆఫీస రొచ్చి అది "సీ సిక్‌నెస్" అనీ, గాభరా పడొద్దనీ ధైర్యం చెప్పాడు. నేనూ, సాధనా వేరువేరు కేబిన్సు తీసుకున్నాము. ఈ రెండురోజులూ నేను కేబిను విడిచిపెట్టలేదు. సాధన నాకు షిప్ ఎక్కిన మర్నాడు 'హార్లో' అనే ముప్ఫయ్యేళ్ళ



యువకుణ్ణి—బ్రిటిష్ నేవల్ ఆఫీసరుని పరిచయము చేసింది. వాళ్ళిద్దరూ ఆ రెండ్రోజులూ శ్రద్ధగా పరిచర్య చేశారు. తర్వాత తేరుకున్నాను. రోజూ సాయంత్రం పోర్ట్ వైన్ తీసుకునేవాళ్ళం. రాత్రిళ్ళు ఒకళ్ళిద్దర్ని పిలిచి పోకర్ ఆడుకునేవాళ్ళం. మా ఓడకూడా ఒడుదుడుకులు లేకుండా సాఫీగా నిర్ణీత కాలంలోనే ప్రయాణం సాగిస్తూంది. మర్నాడు 'పోర్ట్ సెడ్' (ఈజిప్టు) చేరుతుందనగానే ఓడలో వున్న వెయ్యిమంది ప్రయాణీకులూ అమితోత్సాహంగా ఉన్నారు. ఎంచేతంటే ఓడప్రయాణీకులకి పోర్ట్ సెడ్ చాలా ముఖ్యమైన రేవుపట్టణం. అక్కణ్ణించి అలెగ్జాండ్రియా సుమారు నూరు కిలోమీటర్లుంటుంది. రెండు గంటల ప్రయాణం. అక్కడ ప్రయాణీకులకు వసతులూ, వినోదాలూ, విలాసాలూ కలిగించే పెద్ద పెద్ద హోటళ్ళూ, హాలిడే సెంటర్లూ వున్నాయి. అక్కణ్ణించి 'పిరమిడ్స్' చూడ్డానికి చాలామంది వెడుతూ వుంటారు.

ఓడ సాయంత్రం కాని బయలుదేరదని తెలుసుండి నేనూ, సాధనా, హార్లో దిగాం. అలెగ్జాండ్రియా వెళ్ళేం. రోజల్లా సరదాగా గడిపేం. తిరిగి ఓడ యెక్కేం. మళ్ళీ ఓడ బయలుదేరిన తరువాత రాత్రి టేబుల్ మీద వైనూ, తినుబండారాలూ సర్ది సాధనని రమ్మనడానికి వెళ్ళాను. కేబిన్‌లో సాధన లేదు. షిప్ కేప్టెన్‌ని అడిగితే సాధనా, హార్లో పోర్టుసెడ్‌లోనే దిగిపోయారని చెప్పేడు. కేప్టెన్ అనుమతి తీసుకుని రిజిస్టర్ చూస్తే పాస్‌పోర్టు మీదున్న వివరాలనిపట్టి అతను నేవల్ ఆఫీసర్ కాదనీ, మార్సీల్స్‌లో ఓ షిప్పింగ్ కంపెనీలో ఇంజనీరనీ, అనారోగ్య కారణంగా మూడు నెలలు స్విడ్జర్లాండులో వుండి వచ్చేడనీ తెలిసింది. అంటే సాధన యితన్ని మూడు నెలల క్రితంనుండీ ఎరుగునన్నమాట ! తెలివిగా తనకి తొలిపరిచయం ఓడమీదే నన్నట్టుగా చెప్పింది.

ఇలా ఆలోచించుకుంటూంటే సంధ్యా, మేష్టారూ, వాళ్ళపాపా వచ్చేరు. నేను స్విడ్జర్లాండునుంచి పట్టుకొచ్చిన బొమ్మ సంధ్య కొడుక్కిచ్చేను. వాడి పేరడిగినప్పుడు 'గిరి' అంటుండగా, సంధ్య కళ్ళల్లో నీళ్ళు దాగలేదు. అనునయంగా మేష్టారు సంధ్యభుజం తట్టాడు. రాత్రి చాలా సేపు కబుర్లు చెప్పుకున్నాం. గిరి చచ్చిపోయేముందు వుత్తరం ఏమయినా రాశాడా అని సంధ్య నడిగేను. లోపలికెళ్ళి పట్టుకొచ్చి వుత్తరం నాచేతిలో పెట్టింది.

'సంధ్యా,

నువ్వు రాసే వుత్తరాలూ, పంపిన పుస్తకాలూ చదువుకుంటూ అంతిమ ఘడియ కోసం ఎదురుచూస్తూ రోజులు ప్రశాంతంగా గడుపుతున్నాను. ఆరోగ్యంగా వున్నన్నాళ్ళూ పొందలేని సుఖశాంతుల్ని ఆఖరి రోజుల్లో ఈ అనారోగ్యం కటాక్షించింది. భగవంతుడు దయామయుడు కాబట్టే నిన్ను నా భార్యగా కాకుండా, గురువుగా చేశాడు.

సాధన అమాయకురాలు. ఆమె జీవిత దృక్పథానికి నేనే బాధ్యుణ్ణి. భోగవిలాసాల స్థాయిని శిఖరాగ్రానికి తీసుకువెళ్ళేను. ఆమె మెట్లు దిగేలోగా నాదారి నేను చూసుకుంటున్నాను. ఎండమావుల్ని వెంటాడుతూ, సాధన వంటరిగా, ఎన్నాళ్ళీ భయంకర జీవితశిక్ష ననుభవించాలో! ఇక్కడ వుంటే నవ్వుల పాలవుతుందేమో నని నీకు సాధ్యమైనంత దగ్గిరలో వుండాలని, సాధనని ఇండియాకు పంపించేశాను. ఎప్పటికైనా ఆమెలో పరివర్తన రాకమానదు. అప్పుడు వెతుక్కుంటూ నీ దగ్గరకొస్తుంది. నువ్వు తప్పకుండా ఆదరించి దారి చూపుతావు.

ఇక నేను చెప్పవలసినదీ, వినవలసినదీ ఏమీలేదు. వాటికి వ్యవధీ లేదు. పరిమితమైన నా జీవితశేషంలో మనస్సు వెనక్కి వెళ్ళకుండా, ఈ రోజుతో సంభాషణలూ, పరామర్శలూ, వుత్తర ప్రత్యుత్తరాలూ కూడా నిషేధించేను. అంచేత యిదే నా తుది నమస్కారం.

శాశ్వతముగా — నీ
గిరి.'

"సాధన సంగతి గిరికి తెలిసిందా ?" అడిగేను.

"నేను తెలియనివ్వలేదు. నేను నీకు రాసినట్టుగానే కంపెనీ గొడవలు కానీ, సాధనగురించికానీ గిరికి రాసి ఆఖరిరోజుల్లో అతని ఆత్మని క్షోభపెట్టొద్దని వాళ్ళ కంపెనీ డైరక్టర్లకి కూడా రాశాను. గిరి నీ కిచ్చిన వుత్తరం సాధనకి చూపెట్టినట్టు తెలియదు కదా! అంచేత నీతోటి యిక్కడకి వచ్చేసిందనుకునే, ఇక్కడే వుండివుంటుం దని అనుకుని వుంటాడు," అంది సంధ్య.

ప్లేన్లో కలకత్తా తిరిగివచ్చేస్తుంటే సంధ్యమాటలు జ్ఞాపకమొచ్చి వులిక్కిపడ్డాను. గిరి నాకు రహస్యంగా యిచ్చిన చీటీ, నేను సాధనకి చూపెట్టినట్టు, నాకూ సాధనకీ తప్ప ఇతరులకు తెలీదు; నేను, గిరికి చెప్పలేదు. మాటల్లో సంధ్యకీ చెప్పలేదు. అయితే యీ విషయం సాధనద్వారా సంధ్యకి తెలుసుండాలి. సాధన సంధ్యకి తనెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ, ఎలా వున్నదీ రాస్తూందన్నమాట. అయితే పర్వాలేదు అని సంతృప్తిగా ఊపిరి పీల్చాను.

